సాక్షి
వికారాబాద్
ఆదివారం । 1 । జూన్ । 2025




చారిత్రక ఆనవాళ్లు ..

అనంతగిరిలోని జైన గుహలను కాపాడుకోవాలని ఫ్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి కోరారు. 8లో▸



పాఠ్యపుస్తకాలొచ్చాయ్

మరో పది రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో బొంరాస్‌పేట ఎమ్మార్సీకి పాఠ్యపుస్తకాలు చేరాయి. 8లో▸



ప్రమాదకరంగా కల్వర్టులు!

బంట్వారం మండలంలోని పలు మార్గాల్లో కల్వర్టులు పూర్తిగా దెబ్బతిన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. 9లో▸

న్యూస్‌రీల్

పది మంది తహసీల్దార్ల బదిలీ

అనంతగిరి: జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పలువురు తహసీల్దార్లను ఆయా మండలాలకు బదిలీ చేశారు. దోమ తహసీల్దార్ పురుషోత్తంను మర్పల్లికి బదిలీ చేయగా, వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న తహసీల్దార్ రవీందర్‌ను మోమిన్‌పేటకు, మర్పల్లి తహసీల్దార్ మునీరుద్దీన్ తహను కలెక్టరేట్‌కు, బుచ్చయ్య(వెయిటింగ్)ను నవాబుపేటకు, వెంకటస్వామి(వెయిటింగ్)ను యాలాలకు, మోమిన్‌పేట తహసీల్దార్ మనోహర్ చక్రవర్తిని కుల్కచర్లకు, వహీదా ఖాతూం తహ(వెయిటింగ్)ను చౌడాపూర్‌కు, షహీదాబేగం తహ(వెయిటింగ్)ను బషీరాబాద్‌కు, వికారాబాద్ ఆర్‌డీఓ కార్యాలయం డీఏఓ గోవిందమ్మను దోమ తహసీల్దార్‌గా, కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్‌ను తాండూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం డీఏఓగా బదిలీ చేస్తూ కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో కొందరు శనివారం బాధ్యతలు చేపట్టారు.

రైతులకు భూ పరిహారం



పులిచర్లకుంట తండా రైతుకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

దుద్యాల్: మండలంలో పారిశ్రామిక వాడ ఏర్పాటుకు భూములు ఇచ్చిన పులిచర్లకుంట తండా రైతులకు శనివారం పరిహారం చెక్కులు అందజేశారు. తండాకు చెందిన 35 మంది రైతులు 94 ఎకరాల భూమిని ప్రభుత్వానికి అందజేశారు. ఇందుకు సంబంధించిన పరిహారం చెక్కులను కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ రైతులకు అందజేశారు. అభివృద్ధికి సహకరించిన రైతులను అధికారులు అభినందించారు. పులిచర్లకుంట తండాలో 80 శాతం మేర భూ సేకరణ పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

ధారూరు మార్కెట్‌కు 2,328 బస్తాల మక్కలు

ధారూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 2,328 బస్తాల మొక్కజొన్నలు వచ్చాయని ఏఎంసీ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. బీట్లలో వ్యాపారులు క్వింటాలుకు తక్కువగా రూ.2,000, మధ్యస్తంగా రూ.2,220, ఎక్కువగా రూ.2,250 వరకు ధర పలికిందని తెలిపారు. అలాగే 1010 రకం వడ్లు 1,919 బస్తాలు రాగా క్వింటాలుకు రూ.1,750, రూ.1,950, రూ.1,970 వరకు, సోనారకం వడ్లు 298 బస్తాలు వచ్చాయని, క్వింటాలుకు రూ.2,150, రూ.2,200, రూ.2,230 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారని ఆమె వివరించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం: రెవెన్యూ గ్రామాల వారీగా ఈనెల 3 నుంచి సదస్సులు ఉంటాయని, ఈ సందర్భంగా వచ్చే ఫిర్యాదులు, అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు కృషి చేయాలని ఆర్డీవో అనంతరెడ్డి అన్నారు. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం, మాడ్గుల మండలాల రెవెన్యూ అధికారులు, సిబ్బందికి శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో అనంతరెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 23వ తేదీ వరకు సదస్సులు కొనసాగుతాయని చెప్పారు. రైతులు, ప్రజలు భూ సంబంధిత సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పరిష్కరించే అవకాశం ఉన్న సమస్యలపై అధికారులు సదస్సులోనే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతారెడ్డి, ఆయా మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోట్‌పల్లిపై నీలినీడలు!

రెండు దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోని ప్రాజెక్టు

- భారీగా పెరిగిన అంచనా వ్యయం
- తాజాగా రూ.89.3 కోట్లతో పాలనాపరమైన అనుమతులు
- జిల్లాలోనే అతిపెద్ద జలాశయం
- ప్రాజెక్టు సామర్థ్యం 1.57 టీఎంసీలు
- ఆయకట్టు 9,200 ఎకరాలు



కోట్‌పల్లి ప్రాజెక్టు

వికారాబాద్: జిల్లాలోనే అతిపెద్ద సాగునీటి ప్రాజెక్టు అయిన కోట్‌పల్లి అభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి. వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల పరిధిలోని 18 గ్రామాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు మరమ్మతులపై పాలకులు నిర్లక్ష్యం చూపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. అంచనాలు.. ప్రతిపాదనలతో కాలం వెల్లదీస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఆనకట్ట, కాలువలు, ఆలుగు, తూములు దెబ్బతినడంతో కేవలం రెండు గ్రామాలకే సాగునీరందించే దీనావస్థకు చేరింది. గతంలో అనేక సార్లు నిధులు మంజూరు వరకు వచ్చి నిలిచిపోయిన ప్రాజెక్టు అభివృద్ధి తాజాగా మరోసారి తెరపైకి వచ్చింది. మరమ్మతుల కోసం ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులు ఇచ్చింది. ఈ సారైనా పనులు పూర్తయ్యేలా చూడాలని ఆయకట్టు రైతులు కోరుకుంటున్నారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1.57 టీఎంసీలు కాగా కుడి, ఎడమ, బేబీ కెనాల్ ద్వారా 9,200 ఎకరాల ఆయకట్టుకు నీరందనుంది.

రూ.3 కోట్ల నుంచి రూ.110 కోట్లకు..

మిషన్ కాకతీయ పథకం కింద గతంలో అనేక సార్లు చెరువులు, కుంటలకు ఆయా ప్రభుత్వాలు మరమ్మతులు చేయించాయి. కానీ కోట్‌పల్లి ప్రాజెక్టును విస్మరించారు. రెండు దశాబ్దాలుగా మరమ్మతు పనులకు నోచుకోలేదు. ఒకటి రెండు సార్లు స్వల్ప నిధులు మంజూరు కాగా ముళ్లపొదల తొలగింపు, కాలువలు,తూముల మరమ్మతుల పేరుతో పనులు మమా అనిపించి నిధులు స్వాహా చేశారే తప్ప పనులు చేపట్టలేదు. ప్రాజెక్టు అభివృద్ధి, మరమ్మతు పనులకు రూ.3 కోట్లతో ప్రారంభమైన ప్రతిపాదనలు ప్రస్తుతం రూ.110 కోట్లకు చేరింది. గడిచిన రెండు దశాబ్దాల కాలంలో 15 సార్లు ప్రతిపాదనలు పంపినా పనులు మాత్రం జరగలేదు. గడిచిన ఐదేళ్ల కాలంలో ఐదు సార్లు రాష్ట్రస్థాయి అధికారులు ప్రాజెక్టును సందర్శించి వెళ్లారు. అయితే ఎట్టకేలకు తాజాగా రూ.89.3 కోట్లతో పాలనాపరమైన అనుమతులు వచ్చాయి. సాంకేతిక పరమైన అనుమతులు రావాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తి కాగానే టెండర్లు పిలిచే అవకాశం ఉంది.

చేపట్టనున్న పనులు

దశాబ్దాలుగా ప్రాజెక్టుకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి.అలుగు పారే చోట చాలా భాగం పాడైంది. కట్ట కూడా దెబ్బతింది. ప్రస్తుత నిధులతో కుడి, ఎడమ, బేబీ కెనాల్‌కు మరమ్మతులు చేయనున్నారు. అలాగే పూర్తిగా పాడైన చోట కాలువలను కొత్తగా నిర్మించాల్సి ఉంది. ప్రాజెక్టు కట్టను సైతం బలోపేతం చేయాల్సి ఉంది. అలుగుకు కూడా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టనున్నట్లు ఇంజనీర్లు పేర్కొన్నారు. ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడిక, చెట్లను తొలగిస్తే పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరు కుంటుందని రైతులు అంటున్నారు. జలాశయాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తే 15 వేల ఎకరాలకు సాగునీరందించే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రాజె క్టు నీటిలో పర్యాటకులు విహరించేందుకు ఓ ప్రైవే టు ఆర్గనైజేషన్ బోట్లను ఏర్పాటు చేసింది. వారు పొలాలకు సాగునీరు వదలకుండా అధికారులపై ఒత్తిడి చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై విచారణ జరపాలని పలువురు కోరుతున్నారు. ప్రస్తుత నిధులు వెనక్కు వెళ్లకుండా ప్రాజెక్టు అభివృద్ధి పనులను వేగవంతం చేసి సకాలంలో పూరయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పేదల సొంతింటి కలను నెరవేర్చండి

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలి
- కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: పేదల సొంతింటి ఆకాంక్షను నెరవేర్చే దిశగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శనివారం కలెక్టరేట్ నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రా ల్లో అసంపూర్తిగా ఉన్న మరమ్మతు పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవోకు సూచించారు. జిల్లాలో గుర్తించిన 331 పాఠశాలల్లో మరమ్మతు పనులను పాఠశాలల పునఃప్రారంభానికి ముందుగానే పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 583 చెంచు కుటుంబాలు ఉన్నాయని వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డీపీఓ జయసుధ, డీటీడీఓ కమలాకర్ రెడ్డి, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

బోధనలో నూతన విధానం అవసరం

విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు నూతన పద్ధతులతో ముందుకు సాగాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రెండు రోజులుగా సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్, విద్యాశాఖ సంయుక్తంగా ఎంఈఓలు, హెచ్‌ఎంలు, డీఆర్‌పీలు, సెక్టోరల్ అధికారులకు 2025 – 26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎఫ్‌ఎల్‌ఎన్ కోసం జిల్లా వార్షిక ప్రణాళిక వర్క్ షాప్ నిర్వహిస్తోంది. శనివారం కలెక్టర్ ఎఫ్‌ఎల్‌ఎన్ అమలు తీరును సమీక్షించి మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల స్థాయిలోనే చిన్నారులకు అక్షరాలు, సంఖ్యలు సులభంగా గుర్తించేలా బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ రేణుకాదేవి, సీఎస్‌ఎఫ్ ప్రాజెక్ట్ లీడ్ జెఫ్తా, ప్రాజెక్టు మేనేజర్ ఆయుషి, సీఎస్‌ఎఫ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

పది సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3 నుంచి 13వ తేదీ పరీక్షలుజరుగుతాయని తెలిపారు. 20 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 5,203 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. 20 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 20 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.



అనంతగిరి: సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్వర్లు

పొగాకుతో ప్రాణాంతక వ్యాధులు

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వెంకటేశ్వర్లు

అనంతగిరి: పొగ తాగడం వల్ల గుండె జబ్బులు, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలోని మెడికల్ కాలేజి కన్‌స్ట్రక్షన్ సైట్‌లో పని చేస్తున్న కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగ తాగడం వల్ల గుండెపోటు, స్ట్రోక్, ఊపిరితిత్తుల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. అనంతరం పొగాకు దూరంగా ఉంటామని కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంకిత స్వచ్ఛంద సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాష్ కుమా ర్, లీగల్ ఎయిడ్ అడ్వకెట్లు వెంకటేష్, రాము, రాజశేఖర్, అంకిత సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, మండల కో ఆర్డినేటర్ సంజీవ్ రావు, సైట్ ఇన్‌చార్జ్ గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నీ అనర్థాలే: పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగుల శిల్ప

పరిగి: పొగాకు, ధూమపానం చేయడం ద్వారా అన్నీ అనర్థాలే జరుగుతాయని పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగుల శిల్ప అన్నారు. అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం పరిగి పట్టణంలోని ఇండస్ వ్యాలీ సుదీక్ష స్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల న్యాయసేవాధికారి సంస్థ వారు పొగాకు వల్ల కలిగే ముప్పుపై కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. ధూమపానం చేస్తే గొంత క్యాన్సర్, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల, క్షయ వ్యాధి, బ్రెయిన్ స్ట్రోక్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. నిరుపేదలు, రోజు వారి కూలీలు ఎక్కువగా అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. క్షణికావేశంలో తప్పులు చేయరాదన్నారు. కోపం వచ్చినప్పుడు ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలా చేయడం ద్వారా తప్పులకు ఆస్కారం ఉండదన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ జిల్లా కోర్డినేటర్ ప్రకాశ్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాది గౌస్‌పాషా, రాము యాదవ్, కృష్ణయ్య, ప్రిన్సిపల్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి మూడు నెలల రేషన్

అనంతగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఒకే సారి (జూన్, జూలై, ఆగస్టు) మూడు నెలలకు సంబంధించిన రేషన్ కోటాను జూన్ ఒకటవ తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 588 రేషన్ దుకాణాలు, 2,51,097 తెల్ల రేషన్ కార్డుదారులు 8,97,270 మంది లబ్ధిదారులు ఉన్నట్లు తెలిపారు. వీరికి ప్రతి నెలా 5,843 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్లు వివరించారు. మూడు నెలల కోటాకు సంబంధించి 16,518 మెట్రిక్ టన్నులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు సజావుగా సాగాలి

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 128 కేంద్రాల్లో 67,250 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.104 కోట్లు రైతులకు ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. మరో 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 24.70 లక్షల గన్నీ బ్యాగులు, అవసరం మేరకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచినట్లు వివరించారు.



జీవరాజును సన్మానిస్తున్న వైద్యాధికారులు

చేసిన సేవలే గుర్తుండిపోతాయి

- జిల్లా వైద్యాధికారి వెంకటరవణ
- ఉద్యోగ విరమణ పొందిన జీవరాజ్‌కు ఘన సన్మానం

అనంతగిరి: విధి నిర్వహణలో మనం ప్రజలకు చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని జిల్లా వైద్యాధికారి వెంకటరవణ అన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జీవరాజ్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం శనివారం పట్టణంలోని తేజ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పదేళ్లపాటు డాక్టర్ జీవరాజు వివిధ హోదాల్లో అత్యంత సమర్థమైన అధికారిగా పనిచేశారని కొనియాడారు. అనంతరం జీవరాజ్ మాట్లాడుతూ.. తనకు అన్ని విధాల సహకరించిన అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ తుకారం, నాంపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాయిబాబా, డాక్టర్ రవీంద్ర యాదవ్, డాక్టర్ రతన్ లాల్, విశ్రాంత డీఎంహెచ్‌ఓ షిండే, వైద్యులు పవిత్ర, బీబీ జానీ, నిరోషా, ప్రవీణ్ కుమార్, టీజీవో ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, జిల్లా పరిధిలోని వైద్యాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసా ఎప్పటికో?

- ఖరీఫ్ సీజన్ ప్రారంభం
- పంట పెట్టుబడి సాయం కోసం అన్నదాతల ఎదురుచూపులు
- జిల్లాలో భూములున్న రైతులు 3.12లక్షల మంది
- సకాలంలో పథకం అమలు చేయాలని విన్నపం



పొలాన్ని సాగుకు సిద్ధం చేస్తున్న రైతు

తాండూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో అన్నదాతలు రైతు భరోసా కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో సాగుకు సిద్ధమవుతున్నారు. పొలాలను దుక్కిదున్నడం.. ఎరువులు, విత్తనాల కొనుగోలుపై దృష్టి సారించారు. ప్రభుత్వం ఇచ్చే పంట పెట్టుబడి సాయం ఎప్పుడు అందుతుందోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం రైతు బంధు పేరిట ఎకరాకు రూ.10 వేల చొప్పున పంట పెట్టుబడి సాయం అందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఈ మొత్తాన్ని రూ.15 వేల పెంచుతామని హామీ ఇచ్చింది. అయితే గత ఏడాది ఎకరాకు రూ.10 వేల చొప్పునే రైతుల ఖాతాల్లో జమ చేసింది. సగం మందికి మాత్రమే పథకం అమలు చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించడంతో నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో జూన్ మొదటి వారం నుంచి ఖరీఫ్ సాగు పనులు మొదలు కానున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పంట పెట్టుబడి సాయం రైతులకు చాలా కీలకంగా మారింది. దీంతో ప్రభుత్వం అందించే రైతు భరో సా కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. అయి తే పథకం అమలుపై ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.

ప్రస్తుత సీజన్‌లో..

జిల్లాలో 3.12లక్షల మంది రైతులు ఉండగా ప్రస్తుత సీజన్‌లో 5.61లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేసే అవకాశం ఉంది. ప్రధానంగా వరి, పత్తి, కంది, మొక్కజొన్న, జొన్న, సోయాబీన్ తదితరల పంటలు వేస్తారు. వీరందరూ ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. అయితే పథకం అమలుపై ఇంకా స్పష్టత రాలేదు. దీంతో పంట సాయం ఎప్పుడు అందుతుందో తెలియక అన్నదాతలు హైరానా పడుతున్నారు.

గత సీజన్‌లో అమలు ఇలా..

నియోజకవర్గం	భూమి ఉన్న రైతులు	లబ్ధి పొందిన వారు	చెల్లించిన మొత్తం (రూ.కోట్లలో..)
కొడంగల్	61,279	45,856	45.30
పరిగి	77,567	57,582	51.91
తాండూరు	59,743	42,393	43.01
వికారాబాద్	94,586	66,158	60.40
నవాబుపేట(మండలం)	19,697	14,264	11.90 కోట్లు

మార్గదర్శకాలు అందలేదు



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట పెట్టుబడి సాయంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు అందలేదు. ఆదేశాలు అందగానే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తాం. గత సీజన్‌కు సంబంధించి కొంత మంది రైతుల ఖాతాల్లో డబ్బు జమ కాని మాట వాస్తవమే.. కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆలస్యంగా జమ అవుతోంది.

– మోహన్‌రెడ్డి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి

మరో ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు

- పది రోజుల క్రితం ఒకరిపై..
- భారీగా అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడిన అధికారులు
- విచారణలో అసలు విషయం వెలుగులోకి
- శాఖాపరమైన చర్యలు తీసుకున్న ఉన్నతాధికారులు



తాండూరు: తాండూరు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మరో ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మూడు నెలల క్రితం తాండూరు సబ్ రిజిస్ట్రార్ పూర్య బదిలీ అయ్యారు. దీంతో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సాయికి ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగించారు. అప్పట్లో 20 రోజుల పాటు విధులు నిర్వహించిన ఆయన 27 రోజుల పాటు సెలవుపై వెళ్లారు. ఆ సమయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న పవన్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకొని పవన్ 10 రోజుల వ్యవధిలో 70 ప్లాట్లకు అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారు. ఆ తర్వాత ఆయన కూడా సెలవులో వెళ్లిపోయారు. దీంతో మరో జూనియర్ అసిస్టెంట్ ఫసియొద్దీన్‌కు బాధ్యతలు అప్పగించారు. రోజుకు దాదాపు 50 చొప్పున ఐదు రోజుల వ్యవధిలో 200 రిజిస్ట్రేషన్లు చేశారు. ఉన్నతాధికారులకు అనుమానం రావడంతో విచారణకు ఆదేశించారు. దీంతో అసలు విషయం బయట పడింది. పది రోజుల క్రితం ఫసియొద్దీన్‌ను సస్పెండ్ చేశారు. ఉన్నతాధికారుల ఆడిట్‌లో పవన్ సైతం అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు తేలింది. దీంతో ఆయన్ను కూడా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ సంతోష్ ధ్రువీకరించారు.

క్లుప్తంగా

నంబర్ ప్లేట్‌లేని బైక్‌లు సీజ్

బొంరాస్‌పేట: వాహన ధృవపత్రాలు, నంబర్ ప్లేట్ లేకుండా తిరిగే బైక్‌లను సీజ్ చేస్తున్నామని ఎస్‌ఐ రవూఫ్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని బురాన్‌పూర్‌లో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గ్రామంలోని వై జంక్షన్ వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేసి నంబర్‌ప్లేట్ లేని 21 బైక్‌లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.

డీసీఎం డ్రైవర్‌కు రిమాండ్

నవాబుపేట: మద్యం సేవించి వాహనం నడిపి రైతు మృతికి కారణమైన డీసీఎం డ్రైవర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ అరుణ్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని వట్టిమీనపల్లికి చెందిన గొల్ల కిష్టయ్య ఆవులను మేతకు తీసుకెళ్తుండగా డీసీఎం డ్రైవర్ సత్యర్ సందీప్ మద్యం మత్తులో ఆయన్ను ఢీకొట్టాడు. దీంతో రైతు అక్కడికక్కడే మృత్యువాత పడిన విషయం పాఠకులకు విదితమే. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మద్యం సేవించివాహనాలను నడిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మల్కాపూర్‌లో యువకుల మధ్య ఘర్షణ

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఉద్రిక్తత చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన ఓ వర్గం యువకుడికి మరో వర్గం యువకుడి మధ్య డబ్బు విషయమై మనస్పర్థలున్నాయి. కొత్లాపూర్ శివారులో రేణుక ఎల్లమ్మ జాతరకు శుక్రవారం ఓ యువకుడు వచ్చాడు. విషయం తెలుసుకున్న మరో వర్గం వారు అక్కడి చేరుకుని గొడవపడ్డారు. రాత్రి 11గంటల సమయంలో దాడికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాల వారిని స్టేషన్‌కు తరలించారు. శనివారం ఇరువర్గాల పెద్ద మనుషులు స్టేషన్‌కు చేరుకుని రాజీ కుదుర్చుకుంటామని చెప్పారు. దీంతో వారిని తహసీల్దార్ తారాసింగ్ ఎదుట బైండోవర్ చేశారు.

చిన్నారులకు ముగిసిన ఆధ్యాత్మిక శిక్షణ

తాండూరు టౌన్: హిందూ ధార్మిక పరిషత్ తాండూరు ఆధ్వర్యంలో చిన్నారులకు ఏర్పాటు చేసిన భగవద్గీత శ్లోకాలు, హనుమాన్ చాలీసా పఠన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పరిషత్ కన్వీనర్ గాజుల బస్వరాజ్ మాట్లాడుతూ.. భగవద్గీత శ్లోకాలు, హనుమాన్ చాలీసా పఠనం ద్వారా చిన్నారుల్లో సమస్యా పరిష్కార ధోరణి మెరుగుపడుతుందన్నారు. ఆధ్యాత్మిక చింతనతో నైతిక విలువలు, క్రమశిక్షణ, ఏకాగ్రత, పట్టుదల, కృషి, మానసిక స్థైర్యం పెంపొందుతుందన్నారు. నేతాజీ విద్యాభవన్‌లో వేసవి శిక్షణలో భాగంగా చిన్నారుల కోసం ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. భవిష్యత్‌లోనూ పరిషత్ ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ అందించిన ఉపాధ్యాయురాలు అనురాధను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ ట్రస్టీలు వేణుగోపాల్ రెడ్డి, పటేల్ విజయ్, రమేశ్, రవీందర్ రెడ్డి, పాఠశాల యాజమాన్య సభ్యులు మణిమాల, అభిలాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పైరవీకారులకే జనుము విత్తనాలు

ధారూరు: ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న జీలుగ, జనుము విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. మండలంలోని ఏడు క్లస్టర్లకు శనివారం 166 బస్తాలు (30 కిలోలు) వచ్చాయి. వీటిని మోతుబరి రైతులు గుట్టుచప్పుడు కాకుండా తన్నుకుపోయారని చిన్న, సన్నకారు రైతులు ఆరోపిస్తున్నారు. విత్తనాలు వచ్చిన విషయంపై ఎలాంటి పత్రిక ప్రకటన ఇవ్వకపోవడంతో పాటు కనీసం రైతు సంఘాలకు కూడా సమాచారం ఇవ్వలేదు. దీంతో పైరవీకారులకు మాత్రమే అందాయి. ఎవరు ముందుగా వస్తే వారికే ఇచ్చామని ఏఈఓలు చెబుతున్నా అందులో వాస్తవం లేదని అన్నదాతలు మండిపడుతున్నారు. అవసరం మేరకు విత్తనాలు పంపించాలని జిల్లా వ్యవసాయ అధికారిని కోరినా ఫలితం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

చారిత్రక ఆనవాళ్లు.. జైన గుహలు

- ప్లీచ్ ఇండియా సీఈఓ, పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి
- అనంతగిరిలోని గుహల సందర్శన



అనంతగిరిలోని గుహలను పరిశీలిస్తున్న డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తదితరులు

అనంతగిరి: అనంతగిరిలోని తొమ్మిదో శతాబ్దానికి చెందిన జైన గుహల సముదాయాలను కాపాడుకోవాలని ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ, పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి సూచించా రు. శనివారం ఆయన వీటిని సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. చతురస్త్రం, దీర్ఘ చతురస్త్రాకారంలో ఉన్న ఈ గుహలు 2నుంచి 6మీటర్ల పొడవు, 2నుంచి 3 మీటర్ల వెడల్పు, 2.5 మీటర్ల ఎత్తు కలిగి ఉన్నాయన్నారు. తూర్పు వైపు ద్వారం, నేలపై రాతిపడకలు కలిగి ఉన్నాయని తెలిపారు. జైన మునులు వీటిపై నివసించేవారని, మరణించే వరకూ ఆహారం తీసుకోకుండా రాతి పడకలపై సల్లేఖన వ్రతాన్ని ఆచరించేవారని వివరించారు. ఒక గుహలో పద్మాసనం వేసి ఉన్న జైన తీర్థంకరుని విగ్రహం ఆధారంగా ఈ గుహలు 9వ శతాబ్దం (రాష్ట్ర కూటుల) కాలానికి చెందినవని స్పష్టంచేశారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన 15గుహలను కాపాడుకోవాలని పద్మనాభస్వామి ఆలయ కమిటీ, వికారాబాద్ పురపాలక సంఘం అధికారులను కోరారు. ఆయన వెంట ఆలయ ట్రస్టీ, చైర్మన్ పద్మనాభం, వారసత్వ కార్యకర్తలు డీఆర్ శ్యాంసుందరారావు, బి.వెంకటరెడ్డి, బి.సాయి కిరణ్‌రెడ్డి, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి

తాండూరు రూరల్: రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని రైతులకు డీసీఎంఎస్ కార్యాలయంలో 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే రూ.2లక్షల రుణామాఫీ చేసిందన్నారు. రైతులు రూ.2,137 చెల్లించి 30 కేజీల జీలుగ బస్తాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి కొమురయ్య, ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డె శ్రీను, డైరక్టర్ ఉదయ్‌భాస్కర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు సుభాన్‌రెడ్డి, ఏఈఓలు శివకుమార్, వంశీ, శ్రావణ్‌కుమార్ ఉన్నారు.



జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న బాల్‌రెడ్డి

కాల పరిమితి ముగిసిన చాక్లెట్ల విక్రయం



కాల పరిమితి ముగిసిన చాక్లెట్లు

ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

కొడంగల్: పట్టణంలో కాల పరిమితి ముగిసిన చాక్లెట్లను విక్రయిస్తున్నట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. పట్టణానికి చెందిన ఆవుల బాల ప్రకాశ్ శనివారం ఉదయం బాకారం గేరిలోని ఒక కిరాణ దుకాణంలో డెయిరీ మిల్క్ చాక్లెట్లు కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లి పరిశీలించగా కాల పరిమితి ముగిసినట్లు గుర్తించాడు. తిరిగి అదే దుకాణంలో వాపసు ఇవ్వడానికి వెళ్తే సదరు యజమాని తీసుకోలేదన్నాడు. దీంతో బాల ప్రకాశ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేయగా.. రెండు రోజుల తర్వాత మళ్లీ కొనుగోలు చేయాలని.. కాలం చెల్లిన వాటినే విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని చెప్పారని ఆరోపిస్తున్నాడు. తనిఖీలు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి



పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మండల వైద్యాధికారి కిరణ్

కుల్కచర్ల: ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని మండల వైద్యాధికారి కిరణ్ అన్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆయన వైద్య సిబ్బందితో కలిసి ప్రభుత్వ ఆస్పత్రి నుంచి మండల కేంద్రంలోని వీధుల్లో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు గుట్కా, తంబాకు, సిగరేట్, బీడీ తదితరాలకు దూరంగా ఉండాలని సూచించారు. దేశంలో ఎంతో మంది పొగాకు ఉత్పత్తుల కారణంగా ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. పొగాకులోని నికోటిన్ మెదడుపై పని చేసి మత్తుకు బానిసలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యమా.. మజాకా!

ధారూరు: ఫూట్‌గా మద్యం తాగిన ఓ వ్యక్తి.. మత్తు తలకెక్కి శనివారం మధ్యాహ్నం గంటల తరబడి రోడ్డుపైనే పడుకున్నాడు. దీంతో ధారూరు ఎస్‌బీఎస్ ముందు నుంచి తాండూరు-హైదరాబాద్ రూట్‌లో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బంది పడ్డారు. సాయంత్రం వేళ కొంతమంది అతన్ని లేపి రోడ్డు పక్కన పడుకోబెట్టారు.



యువతి అదృశ్యం

మహేశ్వరం: యువతి అదృశ్యమైన సంఘటన మహేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి సబితా ఇంద్రారెడ్డి కాలనీకి చెందిన రవి కుమార్తె బామండ్ల భవాని(24) ఇంటి వద్దే ఉంటుంది. మే 28వ తేదీన శంషాబాద్‌లోని గౌతమి కళాశాలలో సర్టిఫికెట్లు తీసుకొస్తానంటూ ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం ఎక్కడ వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. స్థానికంగా ఉండే మహేశ్ అనే యువకుడిపై అనుమానం ఉందంటూ ఆమె తల్లి బాలమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధ్యక్ష పదవి కోసం ఆరాటం

- యాలాల మండలంలో త్రిముఖ పోరు
- పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు విశ్వప్రయత్నాలు

యాలాల: అధికార కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత నియామకాల సందడి నెలకొంది. దీంతో పార్టీ శ్రేణులు, కార్యకర్తల్లో నూతన ఉత్తేజం కలుగుతోంది. ఇందులో మండల అధ్యక్ష పదవిని ఆశిస్తున్న నాయకులు పార్టీ పెద్దల ఆశీస్సుల కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పీసీసీ నుంచి నూతన పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలనే ఆదేశాలు ఉండడంతో అధ్యక్ష పదవిని ఎవరిని వరిస్తోందనని మండల వాసులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

చక్రం తిప్పేందుకు..

తాండూరు నియోకవర్గ పరిధిలోని యాలాలకు రాజకీయ ప్రాబల్యం ఉన్న మండలముగా పేరొందింది. నియోజకవర్గంలో చక్రం తిప్పే నాయకులు ఇదే మండలం నుంచి ఎక్కువగా ఉన్నారనే చర్చ తరచూ వినిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార పార్టీ మండల అధ్యక్ష పదవి కోసం పోటీ పెరిగింది.

ట్రయాంగిల్ ఫైట్

పార్టీ మండల అధ్యక్ష రేసులో మండలం నుంచి ముగ్గురు నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు, జక్కేపల్లి గ్రామానికి చెందిన కోర్వని అమృతప్ప, ఇదే గ్రామానికి చెందిన మరో యువ నాయకుడు కుర్వ మహిపాల్, జనరల్ స్థానం వస్తే తనకు అవకాశం ఇవ్వాలంటూ పగిడియాల గ్రామానికి చె ందిన రఘురాం రెడ్డి విన్నవించుకుంటున్నారు. ఈ సారి యాలాల మండల అధ్యక్ష పదవి బీసీ నాయకునికి ఇవ్వాలని పార్టీపెద్దలు సూచనప్రాయంగా తె లపడంతో పోటీ మరింత ఆసక్తికరంగా మారింది.

పెద్దల ఆశీస్సుల కోసం ఆరాటం

కాగా బీసీ సామాజిక వర్గం నుంచి అధ్యక్ష రేసులో ఉన్న అమృతప్ప, మహిపాల్ పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు ఆరాటపడుతున్నారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా ఉన్న రమేశ్ మహారాజ్ ఆశీస్సుల కోసం ఒకరు, మరొకరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అండదండలు ఉన్న నాయకుడు కావడంతో అధ్యక్ష రేసు ఆసక్తికరంగా మారింది. యువతలో పట్టున్న నాయకుడు, గ్రామాల్లోని నాయకులతో సమన్వయం ఉన్న నాయకుడికే అధ్యక్ష పదవి కట్టబెడుతారనే ప్రచారం సాగుతోంది. బీసీ సామాజిక వర్గంలో ఇద్దరు నేతల విషయంలో రాజకీయంగా సమస్య ఎదురైతే తనకు అవకాశం దక్కుతుందనే ఆశతో మరో నాయకుడు తన ప్రయత్నాలు చేసుకుంటున్నాడు.

పోటాపోటీగా దావత్‌లు..!

మండల అధ్యక్ష రేసు విషయంలో పార్టీ పెద్దల వద్ద తమకు అనుకూలంగా ఉండాలనే భావనతో పోటీలో ఉన్న నాయకులు వారం రోజులుగా పోటాపోటీగా మండల నాయకులకు దావత్(విందు) ఇస్తున్నారు. చెన్నారం శివారులోని ఓ నాయకుడి తోటలో మాజీ ప్రజాప్రతినిధులకు, నాయకులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేస్తున్నారు. అధ్యక్ష పదవి తనకు వచ్చేందుకు సహకరించాలని.. అందరికీ అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలు చేపడతానంటూ నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు.

హర్ష టయోటా ఫెస్టివల్ కౌంటర్ ప్రారంభం

శంకర్‌పల్లి: పట్టణంలో హర్ష టయోటా ఫెస్టివల్ కౌంటర్‌ను శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేశ్, ఎంపీడీఓ వెంకయ్యతో కలిసి ఆ సంస్థ సేల్స్ అండ్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ పాములపర్తి, సేల్స్ జనరల్ మేనేజర్ జైపాల్‌రెడ్డి శనివారం ఘనంగా ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అతిథులు.. అనంతరం కొత్త కార్లు, వాటి విశేషాలను అడిగి తెలుసుకున్నారు. వైస్ ప్రెసిడెంట్, జీఎం మాట్లాడుతూ.. హర్ష టయోటా ద్వారా వినియోగదారుల అభిరుచులకు తగ్గట్లుగా మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న యోగేశ్, చిత్రంలో హర్ష టయోటా సంస్థ ప్రతినిధులు

పాఠ్యపుస్తకాలొచ్చాయ్



పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు సరఫరా చేస్తున్న ఎంఈఓ హరిలాల్

ఎమ్మార్సీ కేంద్రాల నుంచి పాఠశాలలకు చేరవేత

బొంరాస్‌పేట: విద్యాశాఖ నుంచి ప్రతీ సంవత్సరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించే పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్. మండల కేంద్రాల్లోని మండల వనరుల కేంద్రం (ఎమ్మార్సీ) నుంచి ఆయా పాఠశాలకు చేరవేసే ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. ఈ మేరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు చేరవేసే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు 91శాతం వరకు పాఠ్యపుస్తకాలు అందాయని ఆయా మండలాల ఎంఈఓలు చెబుతున్నారు. మరో రెండు వారాల్లో పాఠశాలలను ప్రారంభించేలోపు పుస్తకాలు అందరికి అందుతాయంటున్నారు.

విలువైన పుస్తకాలు ఉచితంగా..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించడం తమకు ఎంతో ఆసరా ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఒక్కో పుస్తకానికి బయటి మార్కెట్ ధర రూ.250, ఉంటుందని, ఎలాంటి డిస్కౌంట్‌లు ఉండవని విద్యావంతులు చెబుతున్నారు. ప్రాథమిక స్థాయిలో ఒక్కో విద్యార్థికి రూ.800 వరకు, ప్రాథమికోన్నత, ఉన్నత రూ.వేయి నుంచి రూ.1,200 వరకు ఉండగా ఇక ప్రైవేట్ పాఠశాలలలో పాఠ్యపుస్తకాల దందా ఇంతకు మూడింతలు వసూళ్లు చేసి ఇష్టానుసారంగా ఉంటుందని చెబుతున్నారు.

మండల పరిధిలోని విద్యార్థుల వివరాలు

తరగతి	విద్యార్థులు
1వ	316
2వ	316
3వ	299
4వ	269
5వ	349
6వ	261
7వ	261
8వ	250
9వ	223
10వ	239
మొత్తం	2,783

విద్యార్థుల సంఖ్య ఆధారంగా



ఈ విద్యాసంవత్సరంలో ఆయా పాఠశాలల్లో ఇదివరకు జరిగిన ఆన్‌లైన్ ఎన్‌రోల్‌మెంట్ జరిగింది. దీని ప్రకారం విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠ్యపుస్తకాలు అందాయి. మండల కేంద్రం నుంచి పాఠశాలలకు హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు ముందుండి అందిస్తున్నాం. – సోమ్లా, సీఆర్‌పీ, బొంరాస్‌పేట

సద్వినియోగం చేసుకోవాలి



ఈ నెల 30 నుంచి పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు చేరవేస్తున్నాం. ఆన్‌లైన్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగానే పుస్తకాలు అందజేస్తున్నాం. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేరవేసి తల్లిదండ్రులు ముందుకు రావాలి.

– హరిలాల్, ఎంఈఓ, బొంరాస్‌పేట

నిధులు లేక పనులు సాగక!

- మధ్యలోనే ఆగిపోయిన అదనపు గదుల నిర్మాణం
- సరూర్‌నగర్ ప్రభుత్వ కాలేజీ విద్యార్థులకు తప్పని తిప్పలు
- సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం, అధికారులు విఫలం



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన టాయిలెట్లు



నిలిచిన అదనపు తరగతుల భవన నిర్మాణం

హుడాకాంప్లెక్స్: మరో రెండు రోజుల్లో కాలేజీ తలుపులు తెరుచుకోనున్నాయి. తరగతులు పునఃప్రారంభం కానున్నాయి. పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మంచి కోర్సుల్లో చేరి, బాగా చదువుకోవచ్చని భావించిన నిరుపేద విద్యార్థులకు ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా సమస్యలు స్వాగతం పలకనున్నాయి. నిధుల లేమి, ప్రభుత్వ అలసత్వంతో కాలేజీలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. విద్యార్థుల నిష్పత్తి మేరకు క్లాస్ రూమ్‌లు లేకపోవడంతో ఈసారి కూడా అవస్థలు తప్పేలా లేవు.

రూ.2 కోట్లు మంజూరు

సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆరు కోర్సులు (ఇంగ్లిష్, తెలుగు మీడియం) అందుబాటులో ఉన్నాయి. 700 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలే అధికం. రెండు అంతస్తుల పాత భవనంలో 18 గదులు మాత్రమే ఉన్నాయి. ఇందులో ప్రిన్సిపాల్, స్టాఫ్ రూములతో పాటు లైబ్రరీ, ప్రయోగశాలల కోసం ఏడు గదులను కేటాయించారు. మిగిలిన వాటిలో.. ఆరు గదుల్లో సగటున 40 మందికన్నా ఎక్కువ మంది కూర్చునే వెసులుబాటు లేదు. దీంతో రెండేళ్ల క్రితం ప్రభుత్వం 12 అదనపు గదుల నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించింది. ఇప్పటి వరకు కేవలం రూ.1 కోటి మంజూరు చేసింది. చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. దీంతో కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులు కూర్చునేందుకు తరగతి గదులు, కుర్చీలు లేక ఇబ్బంది పడాల్సి వస్తోంది.

కోర్‌సిటీకి ఆనుకుని ఉండటంతో..

కాలేజీ భవనం కోర్‌సిటీకి ఆనుకుని ఉండటం, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు మంచి మార్కులు సాధిస్తుండటం, కాలేజీ చుట్టుపక్కల అనేక బస్తీలు విస్తరించి ఉండటం, ప్రైవేటు కాలేజీల్లో రూ.లక్షల్లో ఫీజు చెల్లించే స్తోమతే లేని పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ కాలేజీలో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా ఆరు టాయిలెట్లు ఏర్పాటు చేశారు. వీటిలో సైతం సరిపడా నీరు లేకపోవడం, ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో వీటిని వినియోగించేందుకు అమ్మాయిలు వెనుకాడుతున్నారు. తరగతి గదులకు కిటికీలు, డోర్లు కూడా దెబ్బతిన్నాయి. భారీ వర్షాలకు నీరు గదుల్లోకి వచ్చి చేరుతోంది. భవనం పైభాగంలో రక్షణ కోసం గ్రిల్స్ ఏర్పాటు చేయకపోవడం కూడా ఆందోళన కలిగిస్తోంది.

సదుపాయాలు కల్పించాలి



ప్రభుత్వ కాలేజీలను పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బంది పడుతున్నారు. అనేక ఆందోళనల తర్వాత తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణను సైతం గాలికి వదిలేశారు. ప్రభుత్వం స్పందించి కాలేజీలో అన్ని వసతులు కల్పించాలి.

– క్రాంతికుమార్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు

చంపి భూములు తీసుకోండి

- మాడ్గుల మండలం ఇర్విన్ రైతుల ఆవేదన
- రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట బాధితుల ఆందోళన

ఇబ్రహీంపట్నం రూరల్: తమకు విషమిచ్చి చంపిన తరువాతే తమ భూములు రిజర్వాయర్ ఏర్పాటు కోసం తీసుకోవాలని మాడ్గుల మండలం ఇర్విన్ రైతులు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి భూములను నమ్ముకొని జీవిస్తున్నామని, వాటిని కోల్పోతే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తమ ప్రాంతానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి అయితే బాధలు తీరుతాయనుకుంటే ఏ మాత్రం న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రిజర్వాయర్ ప్రతిపాదన ఉండగా సర్కార్ పెద్దలను కలవడంతో విరమించుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రిజర్వాయర్ కోసం భూములు సేకరిస్తే భూమికి భూమి ఇవ్వాలన్నారు. లేదంటే ట్రిపుల్ ఆర్‌కి, ఫోర్త్ సిటీ రోడ్డుకు భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం ఇస్తున్నట్లుగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. గ్రామంలో వేయి ఎకరాలు ఉంటే 900 ఎకరాలకుపైగా రిజర్వాయర్ కోసం కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం రిజర్వాయర్ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి సంగీతకు వినతిపత్రం అందజేశారు.